# నిను వీడే అందుకే వెళ్తున్నా

కె. మధుసూదన్





ముప్పది సంవత్సరాల తర్వాత నీకు సుదీర్ఘమైన లేఖ వ్రాస్తూ నీ నుండి శాశ్వతంగా సెలవు తీసుకుంటున్నాను.

మన వివాహమై ముప్పది సంవత్సరాలు కావస్తున్నా మన మధ్య ప్రేమ, అనురాగం అప్యాయతలకు గౌరవ మర్యాదలకు ఏ మాత్రం తావు లేకుండాపోయింది.

తాళి కట్టినందుకు నాకు కేవలం శరీరాన్ని మాత్రం అర్పించావు. కానీ మనసు మాత్రం మనస్ఫూర్తిగా అర్పించలేకపోయావు. నీ వైఖరి పలు మార్లు గమనించి, ఎంతగా లాలించి బుజ్జగించినా నిజాన్ని రాబట్టలేకపోయాను. ఆ నిజాన్ని నీలో నువ్వే దిగమ్రింగుకున్నావు.

భర్త ఎంతటి సహృదయుడైనా... ఎంతటి విశాల హృదయుడైనా భార్య నిజాన్ని ధైర్యంగా చెప్పలేదు.

అదే నువ్వు చేశావు. ఒకసారి నిద్రలో కలవరిస్తూ కన్నీళ్లు పెట్టుకోవడం స్పష్టంగా గమనించాను.

మరునాడు అదే విషయం అడిగితే! ఏదో చెప్పి తప్పించుకున్నావు.

నువ్వు ఏదో విషయంలో నీకు నువ్వే వర్ణనాతీతంగా బాధపడుతున్నావని స్పష్టంగా గమనించాను. అది ఏ విషయమో ఇంతవరకు నాకు తెలియదు.

ప్రభా నీకు బాగా తెలుసు!

మొదటి నుండి మేమెంతో ఆస్తి పరులమని. నాలుగు తరాలు తిన్నా తరగని ఆస్తి ఉందని. అందుకే డాక్టరేట్ డిగ్రీ సంపాదించినా ఉద్యోగం చేయకుండా హాయిగా బ్రతికేస్తున్నానని.


ఇంకా నీకు బాగా తెలుసు! నేను మంచి భోజన ప్రియుణ్ణని. అందుకే అమ్మ ఎన్నో రకాల వంటలు, పిండి వంటలు చేసి పెట్టేదని, తను చనిపోయే వరకు నిన్ను వంటింట్లోకి రానిచ్చేది కాదని నీతో వంట చేయనిచ్చేది కాదని.

అమ్మ చనిపోయిన తర్వాత నా నోరు ఎంతో చప్పబడి పోయింది. తిండికి మొహం వాచి పోయానంటే నూటికి నూరుపాళ్ళు నిజం.

నా ఇష్టా ఇష్టాలతో నిమిత్తం లేకుండా నాకు ఇష్టం కానివి నేనెంతో అసహ్యించుకునే వంటకాలు వండి. నన్నెంతో అసంతృప్తికి గురిచేసేదానివి.

అమ్మ చనిపోయిన తర్వాత నేనెంతో ఇష్టపడే ఏ వంటకాన్ని ఇంతవరకు చేయలేదు.

కేవలం తిండి విషయం లోనే కాదు. ఇతర విషయాల్లో గూడా నీ ప్రవర్తన నా పట్ల భిన్నంగానే ఉంది.



## సీతారాముల కళ్యాణం...!!

పవిత్ర గోదావరీ తీరం భద్రాచలం...
కొలువు దీరె భద్రగిరిపై రామభద్రుడు..!
భక్తుల పాలిట వరాల పరంధాముడు...
పవిత్రక్షేత్రం అది భక్తులకు పుణ్యానిలయం...!!
'రామ జననం' మానవాళికి మంగళకరం..
'రామ నామం' అది భక్తులకు తారక మంత్రం..!
'రామాయణం' భారతీయులకు ఆదికావ్యం...
'రామ కళ్యాణ వైభవం' సదా నయనానందకరం...!!
ఆలయప్రాంగణాన పలు శిల్పకళా విశేషాలు..
ముఖ్యమంత్రి సమర్పించె ముత్యాల తలంబ్రాలు...!
మంగళవాద్య నాదాలు మగువల మధురగానాలు...
కళ్యాణ ప్రాంగణాన అర్చకుల వేదమంత్రోచ్చారణలు...!!
రామదాసు కీర్తనలకు ప్రతిఫలం రామసాక్షాత్కారం...
త్యాగయ్య కృతులు రామ పాదచరణాలకు అంకితం...!
వాల్మీకి రామకథాగానం భక్తులకు శ్రవణానందకరం...
ఆదర్శదాంపత్యానికి నిదర్శనం 'సీతారాముల కళ్యాణం'...!!!
రాముని నావ ప్రయాణం గుహుని జన్మకు చరితార్థం...
శబరి రుచుల ఫలాలు రామునికి అమృత తుల్యం...!
రావణ సంహారానికి మూలం శ్రీరామావతారం...
రామకళ్యాణ వీక్షణం భక్తులకు మోక్షప్రదం...!!

- తంగెళ్ల పాండురంగ శర్మ

నీ ఆంతర్యమేమిటో నా మీద నీకెందుకింత కక్షో? ఆ భగవంతునికే తెలియాలి.

పెద్దలు అంటూ ఉంటారు. సముద్రపు లోతైనా తెలుసుకొనవచ్చుగాని స్త్రీ మనసులో మర్మాన్ని తెలుసుకోలేమని. అది నీ విషయంలో నిజమనిపిస్తోంది. ప్రభా మనదేశంలో నూటికి డెబ్భయి శాతం వివాహాలు వారిష్టా ఇష్టాలతో నిమిత్తం లేకుండ జరుగుతుంటాయి. ఇష్టమున్నా లేకున్నా మనస్సును చంపుకొని ఒకే గొడుగు క్రింద జీవిస్తున్నారు. జీవిస్తూ! పిల్లలను కంటున్నారు. దీంట్లో విద్యావంతులు ఉండడం గూడా ముఖ్యంగా గమనించతగ్గ విషయం. వారి జీవితాలు చివరివరకు అశాంతితో అసంతృప్తితో కొనసాగుతుంటాయి. వారి అంతమ దిశ గూడా అశాంతితో ముగిస్తుంది.

నువ్వు గూడా బహుశా ఆ కోవకు చెందినదానివని నా నమ్మకం. ఈ నా నమ్మకం ఏ నాటికీ వమ్ముకాదు. అన్ని కోణాల్లో నుంచి పరిశీలించిన తర్వాతనే నేనీ నిర్ణయానికి రావడం జరిగింది. అందుకే నేను ఏ విషయంలో బలవంత పెట్టలేదు. ఏ విషయంలో ఆజ్ఞాపించలేదు. భర్తగా ఏ విషయంలో అధికారం చూపలేదు. కాని నువ్వు మాత్రం ప్రతి విషయంలో నా పట్ల అసంతృప్తి వ్యక్తపరుస్తూ వచ్చావు. ప్రతి విషయంలో చిరాకు పడుతూ వచ్చావు. ప్రతి విషయాన్ని భూతద్దంల్లోంచి చూస్తూ నా మనస్సు విరిగేలా చేస్తూ వచ్చావు. చివరకు పిల్లల ప్రేమాభిమానాలకు నను దూరం చేసి శిక్షించావు. నలుగురి బిడ్డల తల్లివి ఐనా! నీలో మార్పు రాలేకపోయింది. కాలగమనంలోని మార్పులు, గ్రహింపలేకపోయావు. మారుతున్న కాలంలో మనుష్యుల మనస్తత్వాలను గ్రహింపలేక పోయావు.

పాత జ్ఞాపకాలను తుడిచి వేయలేక వాటిని హృదయంలో నుంచి చెరిపి వేయలేక తీవ్ర అసంతృప్తికి నీవు లోనవడం నేను భరించలేక పోతున్నాను.

నేను నా జీవితంలో వసంతం కొరకు ఎదురు చూస్తున్నాను. నా జీవితంలో ఎప్పుడైనా వసంతం రాకపోతుందా? నా జీవితం చిగురింపపోతుందా? ఈ నా జీవితంలో మల్లెల వాన కురవక పోతుందా? ఈ నా జీవితం చిగురించి పుష్పించి కాయలు కాయకపోతుందా? అనే ఆశతో ఇంత కాలం ఎదురు చూశాను. కాని నేడు తెలుసుకున్నాను. ఈ నా ఆశ ఓ దీర్ఘ తీరాల్లో ఉందని? ఈ ఆశ అడి ఆశేనని తెలుసుకొని హృదయ భారంతో దూరంగా పోతున్నాను. ఈ దేశాన్ని విడిచే పోతున్నాను. నీకు కనబడని దూర దేశానికి పోతున్నాను. నీ పోషణ నిమిత్తం పిల్లల పోషణ నిమిత్తం భారీగా బ్యాంక్ బ్యాలన్స్ నింపి మరీ పోతున్నాను.

నా జీవితంలో శాంతిని వెతుక్కుంటూ అశాంతిగా వెళ్తున్నాను. నువ్వు శాంతిగా సంతృప్తికరంగా ఉండాలని దీవిస్తూ నిను వీడి అందుకే వెళ్తున్నా!

నీ వాడు కాని మధు.

❋

